ప్రజాశక్తి

సోమవారం 23, జనవరి 2023 5 శ్రీ సత్యసాయి

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

అక్కడ అలా..ఇక్కడ ఇలా..!

పేదల సొంతింటి కల కలగానే మిగులుతోంది. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన టిడ్కో ఇళ్లు ఇప్పటికీ పూర్తి కాలేదు. ఇదే సమయంలో..ఇదే పథకంతో కర్నాటక రాష్ట్రంలో ప్రారంభించిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయి లబ్ధిదారులు గృహ ప్రవేశం కూడా చేసి జీవనం సాగిస్తున్నారు. అయితే ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఐదేళ్లు గడుస్తున్నా టిడ్కో ఇళ్లకు మోక్షం కలగడం లేదు. డబ్బు చెల్లించినా సొంతింటికి నోచుకోలేకపోతున్నామని లబ్ధిదారులు వాపోతున్నారు.

ఐదేళ్లయినా లబ్ధిదారులకు అప్పగించని టిడ్కో ఇళ్లు

మాటలతో దాటేస్తున్న అధికారులు

అయోమయంలో లబ్ధిదారులు

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అనంతపురం కార్పొరేషన్‌తో పాటు హిందూపురం, ధర్మవరం, కదిరి, తాడిపత్రి తదితర పురపాలక సంఘాల్లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద లబ్ధిదారులకు జీ ప్లస్ త్రీ తరహాలో ఏపీ టిడ్కో ఆధ్వర్యంలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. గత ప్రభుత్వం 50 వేలకుపైగా ఇళ్లు మంజూరు చేస్తే.. వైసిపి ప్రభుత్వం వివిధ కారణాల నేపథ్యంలో 16,272 మంది లబ్ధిదారులకు మాత్రమే టిడ్కో ఇళ్లు నిర్మించి ఇస్తామని ప్రకటించింది. మిగిలిన 34,628 మంది చెల్లించిన డిపాజిట్ నగదు రూ.33 కోట్లు వెనక్కి ఇస్తామని ప్రకటించి మమ అనిపించింది. ప్రభుత్వం ఈ ప్రకటన చేసి కూడా మూడేళ్లైంది. ఇప్పటికీ ప్రకటించిన వారికి టిడ్కో ఇల్లు కట్టించి ఇవ్వలేదు. చెల్లించిన డిపాజిట్ డబ్బులూ ఇవ్వలేదు.

హిందూపురంలో.....

టిడిపి హయాంలో 2018 జనవరి 10న హిందూపురం పట్టణం కొడిపి సమీపంలో ఇళ్లు లేని వారికి ఆర్భాటంగా టిడ్కో ఇళ్ల నిర్మాణాలకు స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ భూమిపూజ చేశారు. సంబంధిత నిర్మాణ పనులను ప్రముఖ కార్పొరేట్ సంస్థ షాపూర్ జి పల్లోంజి దక్కించుకుంది. దాదాపు రూ.160 కోట్లతో 2,750 ఇళ్ల నిర్మాణాలకు చర్యలు చేపట్టారు. గతంలో ఇదే స్థలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్ల పట్టాలు మంజూరు చేసింది. నల్లరేగడి నేల కావడంతో ఇక్కడ ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేమని లబ్ధిదారులు ముందుకు రాలేదు. అపార్ట్‌మెంట్స్ నాణ్యతగా కట్టడం చూసిన లబ్ధిదారులు ఇళ్లను తీసుకోవడానికి ముందుకొచ్చారు. క్యాటగిరి 1 కింద 1104 మంది లబ్ధిదారులు, క్యాటగిరి 2 కింద 478 మంది, క్యాటగిరి 3 కింద 288 మంది లబ్ధిదారులు మున్సిపల్ అధికారులకు డిడిలు చెల్లించారు. దాదాపు 1700 గృహాలు పూర్తి అయ్యాయి.

హిందూపురం కొడిపి సమీపంలో దిష్టి బొమ్మల్లా దర్శనం ఇస్తున్న టిడ్కో గృహాలు

కర్నాటక రాష్ట్రం టుంకూరులో టిడ్కో గృహాల్లో నివాసం ఉంటున్న లబ్ధిదారులు

వీరందరికి నాడు టిడిపి, నేడు వైసిపి ప్రభుత్వాలు రెండూ సార్లు గృహ మంజూరు పత్రాలను అందజేశారు. పక్కాగృహాలు పూర్తవడంతో టిడిపి హయాంలోనే ఆర్భాటంగా అధికారులు లాంఛన ప్రాయంగా గృహప్రవేశాలు కూడా చేయించారు. ఇంకా కొన్ని మౌలిక వసతులు కల్పించాల్సి ఉండడంతో లబ్ధిదారులు ఇళ్లల్లో చేరలేదు. విద్యుత్, రహదారుల పనులు కొంతమేర పూర్తయినా తాగునీరు, ఇతర మౌలిక వసతులు కల్పించడానికి నిధులు మంజూరయ్యే సమయంలో 2019 శాసన సభ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి.

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా మౌలిక సదుపాయాల కల్పనకు చొరవ చూపలేదు. లబ్ధిదారులకు డిసెంబర్‌లో ఇళ్లు మంజూరు చేస్తామని జియో ట్యాగింగ్ సైతం పూర్తి చేశారు. సొంతిల్లు వస్తుందని లబ్ధిదారులు రూ.వందలు ఖర్చు చేసి జియో ట్యాగింగ్ చేయించారు. జిల్లా వ్యాప్తంగా టిడ్కో గృహ నిర్మాణ పనులు నిలబడి మూడేళ్లు అవుతోంది. దశబ్ద కాలంగా పుర ప్రజల సొంతింటి కల కలగానే మిగులుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం టిడ్కో గృహ సముదాయం వద్ద ప్రజలకు అవసరమైన కనీస మౌళిక సదుపాయాలు కల్పించి, మిగిలిన గృహాల పనులను త్వరతగితిన పూర్తి చేయాలని కోరుతున్నారు.

వేగవంతం చేస్తున్నాం..

శ్యాంసుందర్, టిడ్కో ఈఈ

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టిడ్కో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేసే దిశగా చర్యలు తీసుకున్నాం. అక్కడక్కడా సమస్యలు ఉన్నాయి. వాటిని త్వరలోనే పూర్తి చేసి ప్రభుత్వ అదేశాల మేరకు లబ్ధిదారులకు అప్పగిస్తాం. డిపాజిట్ల నగదు విషయం ఉన్నతాధికారులకు నివేదించాం. త్వరలోనే పడతాయని తెలిసింది. పూర్తయిన ఇళ్లను త్వరలోనే అందించే అవకాశం ఉంది. లబ్ధిదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

త్వరగా ఇళ్లు కేటాయించాలి

గృహ లబ్దిదారులకు కేటాయించిన ఇళ్లను పూర్తిచేసి త్వరతగితిన లబ్దిదారులకు స్వాదీనం చేయాలి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులకు ఉచితంగా ఇళ్లు కేటాయించాలి. సొంత ఇంటి కోసం ఎందరో ఆశగా ఎదురు చూస్తున్నారు. వెంటనే ప్రభుత్వం ఆగిన నిర్మాణ పనులను ప్రారంభించాలి. దీంతో పాటు జగనన్న కాలనీల్లో మౌళిక సదుపాయాలు కల్పించి, ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలి. సచివాలయాల పరిధిలో మరోసారి పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించి, ఇల్లులేని వారందరికీ స్థలంతో పాటు ఇల్లు నిరించి ఇవ్వాలి. లేని పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతాం – **ఇంతియాజ్, సిపిఎం సత్యసాయి జిల్లా కార్యదర్శి**

మత్స్యకారుల అభివృద్ధికి కృషి

సత్యసాయి జిల్లా మత్స్యశాఖ అధికారి ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

మత్స్యకారుల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తామని మత్స్యశాఖ జిల్లా అధికారి ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. చెరువులలో, రిజర్వాయర్లలో చేపలు పట్టే శ్రామికులను మనం చూస్తూనే ఉంటాం. చెరువుల్లో, డ్యాములలో చేపలు పట్టేవారు అక్కడే రాత్రి పగలు మఖాంవేసి ఉంటారు. చాలామంది అదే వృత్తిగా జీవనం సాగిస్తుంటారు. వర్షాలు బాగా కురిసి డ్యాములలో, చెరువులలో సమృద్ధిగా నీరు చేరితేనే వారి వృత్తి కొనసాగుతుంది. లేకపోతే వారి కష్టాలు చెప్పడానికి వీలుండదు. గతంలో బెస్త కులస్తులు మాత్రమే చేపలు పట్టి వ్యాపారం చేసుకునేవారు. అయితే ఆ రోజులు పోయాయి. నేడు ఎస్సీ, ఎస్టీ, బీసీలలో చాలామంది చేపలు పట్టి జీవిస్తున్నారు. ఇప్పటికీ సరైన మార్కెటింగ్ లేక ఇబ్బందులు పడుతున్న సంఘటనలు ఉన్నాయి. చేపలు పట్టిన రోజే విక్రయించుకోవాలి. వాటిని నిలువ చేసుకునే వీలులేదు. ఆరోజు అమ్ముడు పోకపోతే వాటిని ఎండకు ఎండించి పచ్చి చేపలు కాస్తా ఎండు చేపలుగా వ్యాపారం చేసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వంలో అన్ని శాఖలు ఉన్నట్లే చేపల పరిశ్రమకు మత్స్యశాఖ ఉంది. సత్యసాయి జిల్లాలో చెరువులు డ్యాములు గురించి, చేపలు పట్టే శ్రామికుల గురించి ఆ శాఖ జిల్లా అధికారి ఎన్. చంద్రశేఖర్ రెడ్డి ప్రజాశక్తి ముఖాముఖిలో ఆయన చెప్పిన విశేషాలు ఇలా ఉన్నాయి.

ప్రశ్న : జిల్లాలో ఎన్ని సహకార సంఘాలు ఉన్నాయి?

జవాబు : జిల్లాలో 47 సహకార సంఘాలు ఉన్నాయి. సంఘాలు లేని చోట ఆయా గ్రామ పంచాయతీల ద్వారా వేలం వేయించడం జరుగుతుంది. అనంతపురం జిల్లాలో చేపల ఫారాలు మూడు ఉన్నాయి. నూతన జిల్లా అయిన శ్రీ సత్యసాయి జిల్లాలో ఇలాంటి ఫారాలు ఇంకా నెలకొల్పలేదు. చేపల ఫారాలు ఉంటే చేపల మార్కెటింగ్, చేపల నిలువ తదితర సౌకర్యాలు ఉంటాయి. నూతన జిల్లాలో వాటిని నెలకొల్పడానికి కొంత సమయం పట్టవచ్చు.

ప్రశ్న : చేపలు పట్టేవారికి ప్రభుత్వపరంగా ఎలాంటి సహకారం అందిస్తున్నారు?

జవాబు : కార్మికులు చేపలు అమ్ముకోవడానికి సైకిళ్లు, ఇతర వాహనాల సౌకర్యం కోసం, సహకార సంఘాల కోసం రుణాలు ఇస్తాం. మినీ ఫిష్ రన్నింగ్ స్కీం కింద రూ.లక్ష వరకు రుణం అందిస్తాం. ఎస్సీలకు అయితే 60 శాతం సబ్సిడీ అందిస్తాం. ఇప్పటివరకు 40 మంది లబ్ధి పొందారు.

ప్రశ్న : సిబ్బంది కొరత ఉందా..మత్స్యకారులకు మీరిచ్చే సలహా ఏమిటి?

జవాబు : నూతన జిల్లా కనుక సిబ్బంది కొరత ఉంది. ప్రభుత్వానికి నివేదించాం. మత్స్యకారులు సహకార సంఘాలలో చేరి అభివృద్ధి చెందాలని ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను అందిపుచ్చుకోవాలని కోరుతున్నాం.

పేద రైతుల భూములు కారు చౌకగా లాక్కొంటున్న వైసిపి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్

ప్రజాశక్తి-కనగాన పల్లి

వైసీపీ ప్రభుత్వం పేద,దళిత రైతుల భూముల సోలార్ ప్రాజెక్టు పేరుతో కారు చౌకగా లాక్కుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని బానుకోట వద్ద సోలార్ పేరుతో మంత్రి ఉషశ్రీ చరణ్ తీసుకొన్న భూములను సిపిఎం మండల కార్యదర్శి బత్తల కదిరప్ప, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగార్జునతో కలిసి ఇంతియాజ్ ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరువాత పేద, దళిత రైతులను భూమికి దూరం చేసి వారిని కూలీలుగా మార్చుతోందన్నారు. సోలార్ ప్రాజెక్టుల పేరుతో కారు చౌకగా సేకరించిన భూముల్లో వైసీపీ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడం తప్ప ఎలాంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. మంత్రి ఉషశ్రీ చరణ్ భానుకోట వద్ద సోలార్ పేరుతో భూములు తీసుకుందన్నారు. ఇక్కడ భూములు కోల్పోయిన రైతులంతా దళితులే అని వారికి ఆర్అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వకుండా కారు చౌకగా కొట్టేసిందని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం అధికారం లోకి వచ్చినప్పటి నుంచి సూమారు 80 వేల ఎకరాల భూములు ప్రాజెక్టుల పేరుతో ప్రభుత్వం స్వాధీనం చేసుకుందన్నారు. నిర్వాసితులకు తగిన పరిహారం, ప్రత్యామ్నాయ భూముల ఉపాధి చూపకుండా వారిని కూలీలుగా మార్చే కుట్రను వైసిపి ప్రభుత్వం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ భూములు కోల్పోయిన రైతులకు న్యాయం జరిగే వరకు ప్రజల మద్దతు కూడగట్టి పోరాటం చేస్తామని హెచ్చరించారు. జిల్లాలోని వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు జిల్లా అభివృద్ధి మరచి ఇసుక, భూములు కొనుగోలు పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా మంత్రి ఉషశ్రీ చరణ్ తీసుకున్న భూముల రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



మంత్రి కొనుగోలు చేసిన భూములను పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, తదితరులు

ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని సాగనంపండి

గుడిబండ : ప్రజా సమస్యలను విస్మరిస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ప్రజలకు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని కెఎన్ పల్లిలో ఆదివారం నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీతో పాటు టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు తొలుత బస్టాండ్ ప్రాంతంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లిప్రస్తుత ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, నాయకులు రవిశంకర్ స్వామి, సురేష్, నాగరాజు, గిరీష్, గిరే తిమ్మప్ప, జయరా, శివకుమార్, దుర్గేష్, భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : రాష్ట్రంలో అధికారం చేపట్టినప్పటి నుంచి ప్రతిపక్షాలపై కక్ష సాధింపు, కేసులనమోదుపైనే దృష్టిపెట్టిన వైసిపి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధి గురించి పట్టించుకోవటం లేదని టిడిపి నాయకులు విమర్శించారు. పురపాలక సంఘం పరిధిలోని 37వ వార్డులో ఆదివారం చేపట్టిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో టిడిపి క్లస్టర్ ఇన్చార్జి చంద్రమోహన్, వార్డు కౌన్సిలర్ మహాలక్ష్మి, నాగేంద్ర, నాగరాజు, మారుతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు వార్డులో ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై మోపిన పన్నుల భారాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఉమర్ ఫారూఖ్‌కు జాతీయ సాహితీ పురస్కారం

ప్రజాశక్తి -హిందూపురం

పట్టణానికి చెందిన ముస్లీం నగారా అధ్యక్షుడు ఉమర్ ఫారూక్‌కు గిడుగు రామ్మూర్తి జాతీయ సాహితీ పురస్కారం దక్కింది. గిడుగు రామ్మూర్తి 83వ జయంతిని పురస్కరించుకుని శనివారం రాత్రి హైదరాబాద్‌లోని శంకరం వేదిక హాల్లో గిడుగు రామ్మూర్తి పంతులు పౌండేషన్, శంకరం వేదిక సంయుక్తంగా సాహిత్య, కళా, సేవారంగాల వారిగా కృషి చేసిన వారికి పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఉమర్ ఫారూక్ రాసిన 'నేనూ ఈ దేశపు మూల వాసినే' అనే దీర్ఘ కవితకు, అలాగే ఆయన సేవలకు గిడుగు రామ్మూర్తి జాతీయ పురస్కారం దక్కగా, పురస్కారాన్ని పౌండేషన్ అధ్యక్షురాలు గిడుగు కాంతికృష్ణ, కళారత్న బిక్కికృష్ణ, తెలంగాణా హైకోర్టు న్యాయమూర్తి రాధారాణి, ఇన్‌కం ట్యాక్స్ కమిషనర్, జీవన్లాల్ లవాడియా, శతచిత్ర నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ, బీసీ కమిషన్ అధ్యక్షుడు వకుళా భరణం కృష్ణ మోహన్ చేతుల మీదుగా అందుకున్నారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ రాధారాణి చేతుల మీదుగా ఉమర్ ఫారూక్ రాసిన నేనూ ఈ దేశపు మూల వాసినే దీర్ఘ కవితా పుస్తకాన్ని ఆవిష్కరించారు.

వేమన ఒవడికి కొరవడి లేకుండా కొనసాగింపే..అమర్ రచనలు..

ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వేమన ఒరవడికి కొరవడి లేకుండా కొనసాగింపే.. తరిమెల అమర్‌నాథ్‌రెడ్డి రచనలు అని ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీవో హోంలో మానవత కన్వీనర్ తరిమెల అమరనాథ్‌రెడ్డి రచించిన 12వ పుస్తకం 'మేరా భారత్ మహాన్' ఆవిష్కరణ సభ ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన జరిగినది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తరిమెల అమరనాథ్‌రెడ్డి సమకాలీన మానసిక భావజాలాలను సమాజంలో పెరుగుతున్న అంధ, మూఢ, మతమౌఢ్యాలను తన పదునైన అక్షరాలతో సూక్ష్మంగా చదువు రాని పేదలకు సైతం సులువుగా అర్థమయ్యే విధంగా ఉండడం ప్రజాకవి వేమన వరవడిని కొరవడి లేకుండా కొనసాగింపు అనిపిస్తుందన్నారు. 400 సంవత్సరాల క్రితం వేమన తన పద్యాలతో సమాజంలో ఉండే మూఢనమ్మకాలను ఏ విధంగా ప్రశ్నించినాడో ఆధునిక కాలంలో మనిషి అంతరిక్షం దాటి ఆకాశం అంచులను సరిహద్దులుగా పెట్టుకునే తరుణంలో కూడా అంతే అంధ విశ్వాసాలతో ఉన్నారని.. పేదవాడికి పనిముట్టుగానే చూస్తున్నారే తప్ప మనిషిగా చూడడం లేదన్నారు. డబ్బును గౌరవించే సంస్కారం నుండి మనిషిని మనిషిగా గౌరవించే సంస్కారమైన సమాజం కావాలని కోరుకుంటాడన్నారు. అనునిత్యం శ్రమజీవుల మధ్య వారి కోసం పాటుపడుతూ, వారి సాధకబాధకాలను తనుకు ఎదురైన పరిస్థితులు, సంఘటనలకు అక్షర రూపం ఇచ్చి 12 పుస్తకాలను అమర్‌నాథ్ సమాజానికి అందించారన్నారు. తాను నమ్మే సిద్ధాంతాలను ఆచరణ రూపంలో పెట్టడమే నేటి 'మేరా భారత్ మహాన్' అని కొనియాడారు. జన్నే గణేష్ చేతుల మీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించడం.. సాధారణ రక్తదాత, అతి సామాన్య శ్రమజీవి జన్నే గణేష్.. ఈ ఉదాహరణ చాలు అమరనాథ్ రెడ్డి ఆలోచనలకు అద్దం పట్టడానికి అని తెలిపారు. విరసం రచయిత్రి ఆర్ శశికళ ప్రసంగిస్తూ సామాన్యుల గొంతుకగా తరమెల అమరనాథ్ రెడ్డి సమాజంలో జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించే నైజం ఆయన రచనలలో కనబడుతుంది అనడానికి ఉదాహరణ.. 'మతం రాజకీయాల అక్రమ దాంపత్యాన్ని విడాకులు ఇప్పియ్యాల అంటాడు.. శ్రమజీవుల స్వేదమే సమాజ పురోగతికి పెట్టుబడి అయినా వారికి ఆ పూట కూలి మాత్రమే దక్కుతుంది అని ఆవేదన చెందుతాడు.. మెడ కోసినా మడి కోసినా.. నాటు వేసినా.. ఓటు వేసినా.. నాకు దక్కేది ఆ పూట కూలి మాత్రమే అని పేదల తరపున ప్రశ్నిస్తాడు అంటూ తన ప్రసంగాన్ని ముగించారు. రాధా స్కూల్ ఆఫ్ లర్నింగ్ వేలూరి జయచంద్ర ప్రసంగిస్తూ 'మూఢవిశ్వాసాల జాడ్యం నిండకపోయినా ఈ సమాజంలో భవిష్యత్ తరానికి జాడ్యం తాకకుండా ప్రభుత్వాలు శాస్త్రీయ దృక్పథంతో కూడిన పాఠ్యాంశాలని అందించాలని.. అప్పుడే భవిష్యత్తులో సామాజిక స్పృహతో కూడిన సమాజం ఎదుగుతుందని, తక్షణ కర్తవ్యంగా ఎవరికి వారు ముఖ్యంగా ఉపాధ్యాయులు ఈ బాధ్యతను తీసుకోవాలని.. ఆయన ఆవేదన వ్యక్తం చేసిన తన మాటలు, రాతలలో ఆక్రందన తనకు కనపడుతుందన్నారు. తరిమెల అమరనాథ్ రెడ్డి రచనల సమీక్షకులుగా డాక్టర్ బావకాటి రాఘవేంద్ర సుదీర్ఘమైన, సుస్పష్టమైన విశ్లేషణ సభలో ఆశీనులైన వారిని మంత్రముగ్ధుల్ని చేసింది. నగర ప్రముఖులు, కవులు, రచయితలు, మేధావులు, కళాకారులు, మానవతా రక్తదాత సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలో బుక్కరాయసముద్రం మండలం రోటపురం నుంచి తాడిపత్రి మండలం భోగసముద్రం వరకు జరుగుతున్న జాతీయ రహదారి రోడ్డు విస్తరణలో భాగంగా ఇళ్లు , భూములు కోల్పోతున్న బాధితులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని రోడ్డు నిర్వాసితులు, ఎపి రైతుసంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహిస్తున్నట్లు ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. 2023 ధరల ప్రకారమే బాధితులకు పరిహారం ఇవ్వాలన్నారు. శివపురం, బండమీదపల్లి, చక్రాయపేట, పోతురాజు కాలవ, పెరవలి, నాయనపల్లి క్రాసింగ్‌లో వ్యవసాయ భూములు కోల్పోతున్న రైతులకు కనీసం సెంటు రూ.50వేలతో పరిహారం ఇవ్వాలన్నారు. పూర్తిగా భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారంతో పాటు ప్రభుత్వ భూమిని కేటాయించాలన్నారు. ఇళ్లకు సంబంధించి 2023 భూముల రేటు ప్రకారం నష్ట పరిహారం చెల్లించడంతో పాటు, 5 సెంట్ల స్థలం ఇచ్చి అందులో ఇల్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. గ్రామ కంఠంలో ఉన్న ఇళ్లకు ప్రయివేటు భూములతో సమానంగా ధరను నిర్ణయించి పరిహారం ఇవ్వాలని నిర్వాసితుల పక్షాన చేపట్టిన ధర్నాలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఇళ్ల నిర్మాణాలకు అనుమతించండి : సిపిఎం

ప్రజాశక్తి - సోమందేపల్లి

స్థానిక నక్కల గుట్ట ఇండ్ల స్థలాల లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలకు అనుమతించాలని తహశీల్దార్ ఏర్పాటు చేసిన నోటీసు బోర్డును తక్షణం తొలగించేందుకు అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని సిపిఎం ఆధ్వర్యంలో బాధిత లబ్ధిదారులు స్థానిక ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్దన్న మాట్లాడుతూ వివిధ కారణాలు , ఆర్థిక ఇబ్బందుల వల్ల సకాలంలో పేదలు ఇల్లు నిర్మించుకోలేకపోయారన్నారు. అయితే ప్రభుత్వం మారిన తర్వాత పట్టాదారులలో అనర్హులు ఉన్నారంటూ నిర్మాణ పనులకు ఆటంకాలు కల్పిస్తున్నారన్నారు. దీంతో బాధితులు హైకోర్టును ఆశ్రయించి కోర్టు ఉత్తర్వుల ప్రకారం బాధితులు ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. అయితే ఎటువంటి సమాచారం ఇవ్వకుండా తహశీల్దార్ నోటీసు బోర్డు ఏర్పాటు చేశారని వాపోయారు. ఈ విషయంపై ఎమ్మెల్యే జోక్యం చేసుకుని బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు హనుమయ్య, వెంకటేష్, రంగప్ప, గంగరాజు, మాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు బాలస్వామి, సిఐటియు మండల నాయకులు కొండా వెంకటేష్ , నాగభూషణ, చేనేత కార్మికులు శీలా నారాయణస్వామి, బేల్దారి వెంకటేష్ , రామాంజి, లబ్ధిదారులు లీలావతి, షాహినా, రామాంజనేయులు, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీనివాసులుతో పాటు 50 మంది బాధిత లబ్ధిదారులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

యోగి వేమన విగ్రహావిష్కరణ

హిందూపురం : పట్టణంలోని బైపాస్ రోడ్‌లో సడపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన యోగి వేమన విగ్రహాన్ని రెడ్డి సంఘం నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. విగ్రహావిష్కరణ వేడుకల్లో భాగంగా పట్టణంలోని రోడ్లు, భవనాల శాఖ కార్యాలయం నుంచి విగ్రహం వరకు ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. విగ్రహ ఏర్పాటుకు కషి చేసిన రెడ్డి జెఎసి కార్యవర్గ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి జెఎసి జిల్లా అధ్యక్షులు వెంకటేష్ రెడ్డి, నాయకులు మధుమతి, వేణుగోపాల్ రెడ్డి, బలరామిరెడ్డి, డాక్టర్. అశ్వర్థరెడ్డి, జనార్ధన్ రెడ్డి, కొటిపి హనుమంతరెడ్డి, శ్రీరామరెడ్డి, వేణురెడ్డి, మారుతీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

24న కదిరిలో ప్రత్యేక విద్యుత్ అదాలత్

పుట్టపర్తి అర్బన్ : విద్యుత్ ప్రత్యేక అదాలత్ ను ఈనెల 24న కదిరిలోని పవర్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఏపీ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ ఇఇ జెమోసెస్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్థిక సభ్యులు కె.రామ్మోహన్ రావు, సాంకేతిక సభ్యులు ఎస్ఎల్ అంజనీ కుమార్, స్వతంత్ర సభ్యులు ఈశ్వరమ్మతో పాటు విద్యుత్ అధికారులు పాల్గొంటారన్నారు. డివిజన్ పరిధిలో కదిరి, నల్లచెరువు, తనకల్లు, అమడగూరు, ఓడిసి, ఎన్పీ కుంట, ముదిగుబ్బ, నల్లమాడ, గాండ్లపెంట, తలుపుల, పుట్టపర్తి, గోరంట్ల, కొత్తచెరువు, బుక్కపట్నం మండలాలకు సంబంధించిన వినియోగదారులు తమ సమస్యలను విద్యుత్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని ఆయన తెలిపారు.

నిధులున్నా... అభివృద్ధి సున్నా

కోనేరులో మురుగునీటిని తలపిస్తున్న నీరు

ప్రజాశక్తి - కదిరి టౌన్

రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన నవ నరసింహ ఆలయాల్లో కదిరి నారసింహుల క్షేత్రం ఒకటి. ప్రహ్లాద సమేత విగ్రహం కదిరిలో తప్ప మరెక్కడ కనిపించదు. ప్రతి ఏడాది మాఘ మాసంలో శుద్ధ విదియ నాడు ప్రారంభమయ్యే శ్రీవారు బ్రహ్మోత్సవాలు 15 రోజులపాటు భక్తులను కనువిందు చేస్తాయి. కర్నాటక, తమిళనాడు, తెలంగాణ వంటి పొరుగు రాష్ట్రాల నుండి భక్తులు పోటెత్తడం ఇక్కడ మనం చూడవచ్చు.
ఇంతటి విశిష్టత కలిగిన ఆలయానికి సౌకర్యాల గ్రహణం పట్టి పీడిస్తోంది. శ్రీవారి భక్తులకు అడుగడుగునా సమస్యలు ఎదురవుతున్నాయి. సుదూర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు కోనేరులో స్నానం చేయడానికి వెళ్తే ఇది కోనేరేనా అన్న సందేహం వ్యక్తం చేసే పరిస్థితి ఉంది.ఒకప్పటి స్వామివారి ఇష్టమైన భవనాసినీర్థం మద్దిలేరు వాగు ఇప్పుడు పట్టణంలోని నివాసాల మురుగునీటితో నిండిపోయింది. ఆ మురుగునీరు కోనేరులోకి ప్రవహించకుండా అడ్డుకట్ట వేసేందుకు కోనేరు అభివృద్ధి కొరకు రెండు సంవత్సరాల క్రితం ఆలయ నిధులు రూ. 2.20 కోట్లు వెచ్చించారు. అంత పెద్ద మొత్తంలో నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టినప్పటికీ ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. కోనేరు వద్ద మురుగునీరు దర్శనమిస్తోంది. ఇందులో స్నానం ఎలా అని పలువురు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇంత పెద్ద మొత్తంలో నిధులు వెచ్చించి నామమాత్రం పనులు చేసి చేతులు దులిపేసుకున్నారన్న విమర్శలు వినపడుతున్నాయి.
శ్రీవారి దర్శన భాగ్యం కోసం సుదూర ప్రాంతాలైన కర్నాటక, తమిళనాడు నుండి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం తాగునీటి సౌకర్యం లేదు. అదేవిధంగా దర్శనం కోసం వచ్చే భక్తుల నుండి వాహనాల పార్కింగ్ కొరకు రుసుం వసూలు చేస్తున్నప్పటికీ సరైన పార్కింగ్ సదుపాయం లేదు. దీంతో పట్టణంలో ఎక్కడపడితే అక్కడ ఆలయం తిరువీధుల్లో ,నివాసాలు, ఆలయం ముందర, పరిసర ప్రాంతాల్లో హిందూపురం ప్రధాన రహదారిపై బయట నుంచి వచ్చే భక్తులు వాహనాల ఉంచడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది.

వసతి సముదాయాలు కరువు ....

శ్రీవారి దర్శన భాగ్యం కోసం వచ్చే భక్తులు స్వామివారి చెంత సేద తీరుదామని ఒకటిరెండు రోజులు ఉందామని అనుకుంటే సరైన వసతి సముదాయాలు లేవు. దీంతో వారు ప్రయివేటు లాడ్జిలను ఆశ్రయించాల్సి రావడంతో అధిక మొత్తం వెచ్చించి బస చేయలేక వచ్చిన రోజే దర్శన భాగ్యం చేసుకొని వెనుతిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఆలయ వార్షికాదాయం రూ. 10 కోట్ల నుంచి 12 కోట్ల రూపాయల ఆలయానికి వస్తున్నప్పటికీ చిన్నపాటి అభివృద్ధి పనులు చేయాలన్నా విరాళాలు సేకరించడానికి భక్తుల కోసం గాలం వేయడం ఇక్కడి ఆలయ అధికారులు ఆనవాయితీగా చేసుకున్నారు. అధికారులు, పాలక వర్గ సభ్యుల తీరుపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హుండీల ద్వారా వచ్చిన ఆదాయం బంగారు ఇతర వస్తువులు కలుపుకుంటే దాదాపు కోటి రూపాయల వరకు ఆదాయం వస్తుందని తెలుస్తోంది. ఇంత ఆదాయం ఉన్నప్పటికీ ఆలయ పరిసర ప్రాంతాలలో అపరిశుభ్రత దర్శనమిస్తోంది. పాదరక్షకులు, వాహన రుసుం, సర్వదర్శన టికెట్టు రుసుము ఇలా రకరకాల పేర్లతో భక్తుల వద్ద ముక్కు పిండి నగదును వసూలు చేస్తున్న ఆలయ అధికారులు భక్తులకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో విఫలం అయ్యారన్న విమర్శలు వినపడుతున్నాయి. ఆలయ సమీపంలో టెంకాయ, పూలమాల విక్రయాల్లో వందల రూపాయల ధరలు పెంచి వసూలు చేస్తున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదని భక్తులు ప్రశ్నిస్తున్నారు. గతంలో భక్తాదులు ఆలయానికి గోవులు సమర్పించారు. దేవస్థానానికి సంబంధించిన వందల గోవులు గతంలో ఉండటంతో గోశాల కోసం గాండ్లపెంట మండలం కటారుపల్లి వద్ద ఆలయ నిధులతో గోశాల ఏర్పాటు చేశారు. ఆ గోశాల ఇక్కడికి 13 కిలోమీటర్ల దూరం కావడంతో అది నిరుపయోగంగా మారింది. దీంతో భక్తులు దేవస్థానానికి అందజేసిన గోవుల సంరక్షణ కరువై పట్టణంలో ఎక్కడబడితే అక్కడ రోడ్లపై ఉండడంతో ప్రమాదాలకు గురై మృత్యువాత పడడంతో నేడు పదుల సంఖ్యకు చేరుకున్నాయి. ఆలయ గోవులను సంరక్షించుకోవడానికే అధికారులకు, పాలకులకు చేతగానిపనిగా మారిందన్న వ్యాఖ్యానాలు వినపడుతున్నాయి. ఎక్కడా గోశాల లేనప్పటికీ గోశాల పేరుతో లక్షలాది రూపాయలు విరాళాలు సేకరిస్తూ ఇతర కార్యక్రమాలకు వినియోగించుకుంటున్నారని అయితే భక్తుల నుంచి వసూలు చేస్తున్న విరాళాలు ఎక్కడికి వెళుతున్నాయని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారిందని వ్యాఖ్యానిస్తున్నారు.కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి ఎలాంటి ప్రయోజనము లేకుండా భృగతీర్థాన్ని వదిలేయడం ఎంతవరకు సబబు అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

ఆలయ ఆస్తుల వివరాలు బహిరంగంగా ప్రకటించాలి

స్వామివారి ఆస్తులు,నిధులు ఏ మేరకు ఉన్నాయో బహిరంగంగా ప్రకటించి వాటినే అభివృద్ధికి ఖర్చుపెట్టి త్వరలో జరగనున్న బ్రహ్మోత్సవాలకు కోనేరును శుభ్రపరచాలని, భక్తులకు సౌకర్యాలను చేసి చూపించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఖాద్రీశుడి చెంత సౌకర్యాల చింత
త్వరలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు

ఏందప్పాసామీ... కోనేరు ఇలా ఉంది... ?

ఏందప్పా సామీ కోనేరు ఇలా ఉంది.మా ఇంటి ఇలవేల్పు దేవుడు కదిరి లక్ష్మీనరసింహస్వామి. ప్రతి సంవత్సరం స్వామి దర్శనానికి వస్తాము. ఎప్పుడూ కోనేరులో నీరు పోసుకుందామన్నా కోనేరు అధ్వానంగా ఉంటోంది. పాచి పట్టి, బురద కాలువను గుర్తుకు తెస్తోంది. ఇప్పుడు గతంలో కంటే అధ్వానంగా ఉంది.కర్నాటక రాష్ట్రం గౌరీబిదనూరు నుంచి చాలామంది వస్తుంటారు. వాళ్ళందరూ కోనేరు చాలా అధ్వానంగా తయారైందని చెబుతుంటారు . కనీసం ఏడాదికి ఒకసారి జరిగే బ్రహ్మోత్సవాలకైనా బాగు చేస్తారా అని అనుమానం కలుగుతోంది.

కర్నాటక భక్తురాలు

కోనేరు ను చూస్తే కన్నీరు వస్తుంది

ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి భృగతీర్థాన్ని (కోనేరును) చూస్తే ఇది ఒకప్పటి కోనేరేనా అన్న అనుమానం కలుగుతుంది. ప్రభుత్వనిధులు కాకపోయినా, ప్రజాప్రతినిధులతో చేత కాకపోయినా భక్తుల సమర్పిస్తున్న హుండీ ఆదాయంతోనైనా అభివృద్ధి పనులు చేయాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ అధికారులు కనీసం నెలకు రెండు మూడు సార్లైనా కోనేరును సందర్శించి అక్కడ ఉన్న పరిస్థితులను వాతావరణాన్ని చూడకపోవడం బాధాకరంగా ఉంది. త్వరలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో కోనేరును అభివృద్ధి చేయాలని కోరుతున్నాం.

రమేష్, భక్తుడు

డివైడర్‌ను ఢీ కొన్న కారు

కనగానపల్లి : మండల పరిధిలోని ముక్తాపురం వద్ద జాతీయ రహదారి44 పై ఆదివారంనాగలమడక నుంచి అనంతపురం వస్తున్న కారు డివైడర్‌ను ఢీ కొని బోల్తా పడింది. ఈ ప్రమాదం లో పూజారి జనార్దన, కొండూరు లీలావతి అనే ఇద్దరు దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని హైవే పెట్రోలింగ్ పోలీసులు అనంతపురం లోని మేడా నర్శింగ్ హోంకు తరలించారు. కుటుంబంతో కలిసి నాగలమడక దేవస్థానానికి వెళ్లి తిరిగి అనంతపురం వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేయనుకున్నట్లు పోలీసులు తెలిపారు.

అక్రమంగా మద్యం అమ్మినా, రవాణా చేసినా చర్యలు

ధర్మవరం టౌన్ : ఎవరైనా అక్రమంగా మద్యాన్ని అమ్మినా, రవాణా చేసిన, గంజాయి అమ్మినా, మట్కా, పేకాట ఆడినా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వన్‌టౌన్ సిఐ సుబ్రమణ్యం హెచ్చరించారు. ఈ మేరకు వన్ టౌన్ పోలీస్టేషన్లో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు చెప్పారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

ఒబులదేవరచెరువు : మండల పరిధిలోని మిట్టపల్లికి చెందిన టిడిపి సీనియర్ కార్యకర్త కుళ్లాయప్ప నాయుడు (80) అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి మృతుని కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతుని కుటుంబసభ్యులకు రూ.5వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామాంజులునాయుడు, సుధాకర్, నాగరాజు, గంగప్ప తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : పట్టణంలోని మార్కెట్ వీధికి చెందిన టీడీపీ పార్లమెంట్ కోశాధికారి చింతపులుసు పెద్దన్న తండ్రి పెద్దన్న(90) శనివారం రాత్రి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాలశ్రీరామ్ పెద్దన్న మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కమతంకాటమయ్య, చింతలపల్లిమహేశ్ చౌదరి. పురుషోత్తంగౌడ్, నాగూర్ హుస్సేన్, రాళ్లపల్లి షరీఫ్, క్రిష్ణాపురం జమీర్ అహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు తప్పనిసరి

బుక్కపట్నం : ఆటో డ్రైవర్లు రోడ్డు నియమ నిబంధనలు తప్పక పాటించాలని ఎస్ఐ నరసింహుడు తెలిపారు. జాతీయ భద్రత వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆటో డ్రైవర్లకు రోడ్డు నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

పెనుకొండ : ప్రస్తుత పరిస్థితుల్లో రోడ్డు ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయని,అందులో మన నిర్లక్ష్యం ఉందని ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని డిటిఒ కరుణసాగర్ రెడ్డి,పెనుకొండ సబ్ కలెక్టర్ కె. కార్తీక్, డిఎస్‌పి హుస్సేన్‌పీరా సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా ఆదివారం పట్టణంలోని శ్రీకష్ణదేవరాయ వై జంక్షన్ వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వై జంక్షన్ నుండి అవగాహన ర్యాలీ ని సబ్ కలెక్టర్ కె. కార్తీక్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ సిఐ కరుణాకర్, ఎస్ఐ రమేష్ బాబు, విజయ్ కుమార్, ఎంవిఐలు, ఎఎంవిఐలు, ఆర్‌టిఒ చెక్ పోస్ట్ సిబ్బంది, ప్రయివేట్ వాహనాల యజమానులు, వాహనాల డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

టుకె వాక్‌లో పాల్గొన్న యుటిఎఫ్ నాయకులు

సిపిఎస్ అంతం యుటిఎఫ్ లక్ష్యం

మడకశిర : సిపిఎస్ అంతమే యుటిఎఫ్ లక్ష్యమని యుటిఎఫ్ నాయకులు అన్నారు. సిపిఎస్ అంతం యుటిఎఫ్ పంతం అన్న నినాదంతో ఆదివారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో టుకె వాక్ వినూత్న కార్యక్రమం చేపట్టారు. నాయకులు మాలింగప్ప, మూడ్లగిరియప్ప ఆధ్వర్యంలో పట్టణంలో టుకే వాక్ నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యుటిఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు భూతన్న, గుడిబండ మండల అధ్యక్షులు నరసింహప్పలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు జోగప్ప, యుటిఎఫ్ నాయకులు మహంతేష్, రమేష్, నరసింహమూర్తి, ఓబన్న, హనుమంతరాయ్, నంజప్ప, దేవరాజు, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

24న చేపల చెరువు వేలం

గుడిబండ : మండల పరిధిలోని ముదిగుబ్బ చెరువులో చేపల పెంపకం కోసం ఈనెల 24న రాళ్లపల్లి పంచాయతీ కార్యాలయంలో వేలంపాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి గోవిందప్ప తెలిపారు. ఇఒఆర్‌డి నాగరాజు నాయక్, సర్పంచి నారాయణప్ప, ఎంపీటీసీ సురేష్ సమక్షంలో ఈ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ వేలంపాటలో పాల్గొనేవారు ముందుగా పంచాయతీకి 5వేల రూపాయలు ధరావతు చెల్లించాలని చెప్పారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ధర్మవరం క్రీడాకారులు

ధర్మవరం టౌన్ : బత్తలపల్లి ఆర్డీటీ క్రీడామైదానంలో శనివారం జరిగిన ఉమ్మడి అనంతపురం జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక పోటీల్లో ధర్మవరం క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరచినట్టు కబడ్డీ కోచ్ పృథ్వీ తెలిపారు. ఉమ్మడి అనంతజట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 25 నుంచి 27వ తేదీవరకు విశాఖపట్నం అంకుపాలెంలో జరగబోయే 70వ సీనియర్ క్రీడాపోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఎంపికైన క్రీడాకారులు ఉష, శ్రీనివాసులు, రాజు, మనదీప్, తానియాలను ఆర్డీటీ ఆర్టీ ప్రమీల, ఎటిఎల్ శ్రీనివాసులు, ఆర్డీటీ కోచ్ అనిల్, రాజశేఖర్ అభినందించారు.

ఆలయ వార్షికోత్సవ వేడుకలు ప్రారంభం

బత్తలపల్లి : బత్తలపల్లిలోని శ్రీలలితా త్రిపుర సుందరీ సమేతా ఓంకారేశ్వరస్వామి ఆలయ నాల్గోవ వార్షికోత్సవ వేడుకలను ఆలయ శాశ్వత ధర్మకర్త, ఏపీ కురుబకార్పోరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు, జెడ్పీటీసీ కోటి సుధ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఉప సర్పంచు కోటి గోపీనాథ్, ఎంపీటీసీకోటి నరేష్, సచివాలయ కన్వీనర్ జయరామిరెడ్డి, బండి వీరనారప్ప, యోగానందాచారీలతో పాటు పలువురు శివదీక్షాపరులు, భక్తులు పాల్గొన్నారు.

మైనార్టీల అభివృద్ధే ధ్యేయం

సోమందేపల్లి : రాష్ట్రంలో మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే శంకర్ నారాయణ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని నక్కలగుట్ట కాలనీ వద్ద మైనారిటీలకు షాదీమహల్ కోసం 30 సెంట్ల స్థలాన్ని కేటాయించారు. అందులో ఆదివారం భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా మండలంలో షాదీమహల్ కలగా మిగిలి పోయిందన్నారు. తాము హామీ ఇచ్చిన విధంగా అడిగిన వెంటనే స్థలం కేటాయించామని, నిర్మాణానికి తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. ఈసదర్భంగా ఎమ్మెల్యేను స్థానిక మైనారిటీలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, ఎంపీపీ గంగమ్మ వెంకటరత్నం, జడ్పీటీసీ డీసీ అశోక్ కుమార్, సర్పంచులు గంగాదేవి నరసింహ మూర్తి, ఆంజినాయక్, కిష్టప్ప, లక్ష్మి నరసప్ప, వైస్ ఎంపీపీ వెంకట నారాయణ రెడ్డి వైస్ సర్పంచ్ వేణు, మైనార్టీలు పాల్గొన్నారు.

భూమిపూజలో నాయకులు

ఉల్లాసంగా క్రికెట్ పోటీలు

పెనుకొండ : ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సవితమ్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ మెమోరియల్ టోర్నీ ఉల్లాసంగా ఉత్సహంగా జరుగుతోంది. మొత్తం టోర్నీ లో 50 టీములు తలపడుతున్నాయి. ఆదివారం సోమందేపల్లి మండలం వెలగమేకలపల్లి గ్రామం, పెనుకొండ త్రివేంద్ర నాయుడు టీములు తలపడ్డాయి. ఈ పోటీలో వెలగమేకలపల్లి టీమ్ విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీలు సూర్యనారాయణ, శ్రీనివాసులు, నాయకులు నీరుగంటి చంద్ర శేఖర్, సూర్యనారాయణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పిఎం శ్రీ ఎంపిక పాఠశాలల పరిశీలన

చిలమత్తూరు : ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైసింగ్ ఇండియా కు చిలమత్తూరు మండలంలో ఎంపిక చేసిన మండల ప్రాథమిక పాఠశాల కొడికొండ, ఎపిఆర్ ఎస్ టేకులోడు పాఠశాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ ఉపసంచాలకులు(డిప్యూటీ డైరెక్టర్) సూర్యప్రకాశ్, ఎంఎఒ మహేంద్ర ఆదివారం పరిశీలించారు. ముఖ్యంగా పాఠశాలలో మౌలిక వసతుల ఆధారంగా అర్హతను బట్టి పిఎమ్ శ్రీకి పాఠశాలలను ఎంపిక చేస్తారు. ఎంపిక చేసిన పాఠశాలలో ఎలాంటి మౌలిక వసతులు, ప్రత్యేక అర్హతలు ఉన్నాయన్న విషయంపై డిప్యూటీ డైరెక్టర్ సూర్యప్రకాశ్ ఆరా తీశారు. ముఖ్యంగా మరుగుదొడ్లు, తాగునీరు, తరగతుల గదులు, రికార్డుల నిర్వహణ వంటి అంశాలపై ఆరా తీశారు. కొడికొండ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు డిప్యూటీ డైరెక్టర్‌కి గులాబీతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ నాగరాజు,కొడికొండ హెడ్ మాస్టర్ అలీముల్లా, సిఆర్‌పి కృష్ణమూర్తి, ఓబులేషు తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : మండలం పరిధిలో ని పులమితి జిల్లా పరిషత్ పాఠశాల, కోడిపల్లి ప్రాథమిక పాఠశాలను రాష్ట్ర పాఠశాలల ఉప సంచాలకులు సూర్య ప్రకాష్, మహేంద్ర ఆదివారం సందర్శించారు. ఈ పాఠశాలలు ప్రధాన మంత్రి శ్రీ పథకానికి ఎంపిక కావడంతో ఆయా పాఠశాలల్లోని సౌకర్యాల గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ నాగరాజు నాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల సౌకర్యాలను పరిశీలిస్తున్న అధికారులు

కేంద్ర పథకాలను తనవిగా చెప్పుకుంటున్న రాష్ట్రం : కేంద్ర మంత్రి

పుట్టపర్తి రూరల్ : కేంద్ర ప్రభుత్వం నిరుపేదల కోసం ప్రవేశపెట్టిన పథకాలను రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం తమ పథకాలుగా ప్రచారం చేసుకుంటోందని కేంద్ర సమాచార మంత్రి దేవాన్ష్ విమర్శించారు. జిల్లా రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆయన పుట్టపర్తి మండల పరిధిలోని పెడపల్లి గ్రామాన్ని ఆదివారం సందర్శించి గ్రామంలోనిమారెమ్మ దేవాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ రాఘవేంద్ర నివాసంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలందరికీ వివరించాలని వాటిపై అవగాహన కల్పించాలని తమ పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. అనంతరం పెడపల్లిలో గిరిజన నాయకుడు రాజేంద్ర నాయక్ ఇంటికి వెళ్లారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కార్యదర్శి సునీల్ దేవదత్, నాయకులు పార్థసారథి, కొండమ రాజు, జ్యోతి ప్రసాద్, డాక్టర్ విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి వినతుల వెల్లువ

పుట్టపర్తి అర్బన్ : కేంద్ర సమాచార శాఖ సహాయ మంత్రి దేవాన్ష్ చౌహాన్ కు వివిధ సంఘాల నాయకులు సమస్యలతో కూడిన వినతి పత్రాలను సమర్పించారు. రెండు రోజు పర్యటన నిమిత్తం పుట్టపర్తికి వచ్చిన మంత్రికి స్థానిక సాయి ఆరాధనలో కలిసిన పలు సంఘాల నాయకులు వినతి పత్రాలు అందజేశారు. ఐజేయు జాతీయ కమిటీ సభ్యుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో జర్నలిస్టులకు పుట్టపర్తి లో ప్రెస్ క్లబ్ కు గ్రంథాలయానికి సహకారం అందించాలని కోరారు. విధి నిర్వహణలో ఎందరో జర్నలిస్టులపై దాడులు జరుగుతున్నాయని ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని కేంద్రం తగిన రక్షణ కల్పించాలని విన్నవించారు. గతంలో కేంద్రం ఇచ్చిన 50శాతం రైల్వే పాసులు యధాతథంగా పునరుద్ధరించాలని పక్కా గృహాలకు కేంద్రమే నేరుగా నిధులు ఇచ్చి నిర్మించాలని కోరారు. 30 ఏళ్లుగా పనిచేసి పదవీ విరమణ పొందిన జర్నలిస్టులకు పదివేలు పింఛన్ ఇవ్వాలని కోరారు. బెస్తలకు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలని, చెరువులలో చేపలు పట్టేందుకు బెస్తలకే ప్రాధాన్యత ఇవ్వాలని కొత్త జిల్లాగా ఏర్పడిన సత్యసాయి జిల్లాకు కేంద్రం ప్రత్యేక నిధులు కేటాయించాలని ఆయా శాఖలను అభివద్ధి చేయాలని ఆసంఘం నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు జ్యోతి చంద్రశేఖర్, సంఘం నాయకులు బెస్త చలపతి, జ్యోతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు రవి నాయక్ ఆధ్వర్యంలో ఎస్టీలలో ఇతర కులాలను చేర్చే జీవో నెంబర్ 52ను రద్దు చేయాలని వినతి పత్రం మంత్రికి అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు విజయ్ కుమార్ నాయక్, మోహన్ నాయక్, సోము నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఆర్యవైశ్యులకు రెండు నుంచి మూడు శాతం రిజర్వేషన్లు కల్పించాలని వాసవి క్లబ్ అంతర్జాతీయ ఉపాధ్యక్షులు సుంకు చంద్రశేఖర్ గుప్తా నాయకులు మారుతి ప్రసాద్, నాగరాజు వినతి పత్రం సమర్పించారు.

అంధకారంలో రొద్దం

రొద్దం : మూడు రోజులుగా మండల కేంద్రమైన రొద్దం అంధకారంలో మగ్గుతోంది. వీధిదీపాలు వెలగక పోవటంతో చీకటి పడితే చాలు గ్రామస్తులు బయటకు రావాలంటే భయపడుతున్నారు. ఈ సమస్యపై సర్పంచి రూప మాట్లాడుతూ విద్యుత్ బకాయిలు చెల్లించలేదని సాకుతో విద్యుత్ అధికారులు రొద్దం ప్రధాన వీధులకు ఉన్న కనెక్షన్‌ను తొలగించినట్లు తెలిపారు. అయితే పంచాయతీలో 11 గ్రామాలకు గాను దాదాపు రెండు కోట్ల రూపాయల వరకు విద్యుత్ బకాయిలు ఉన్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో పంచాయతీకి దాదాపు 25 లక్షల రూపాయల నిధులు వచ్చాయని వీటికి మరో 63 లక్షల రూపాయలు కలుపుకొని 88 లక్షల రూపాయల వరకు బకాయిలు చెల్లించామని అయినా విద్యుత్ సరఫరాను తొలగించారని చెప్పారు. ఈ విషయంపై విద్యుత్ ఎఇ శ్రీనివాసమూర్తినివివరణ కోరగా వీధిలైట్లకు ఉన్న విద్యుత్ కలెక్షన్ తొలగించలేదన్నారు.

రొద్దంలో జరుగుతున్న క్రీడాపోటీలు

క్రీడలతో మానసికోల్లాసం

రొద్దం : క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని టింబక్టివ్ కలెక్టివ్ సంస్థ ప్రతినిధులు అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అనంతశక్తి సొసైటీ ప్రాంగణంలో ఆటల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఆటల పోటీలలో చురుకుగా పాల్గొనాలని దీంతో వారు శారీరకంగా, మానసికంగా ఎదుగుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కల్పవల్లి సిఇఒ చిరంజీవి, కార్యకర్తలు గంగమ్మ, అడవిరాముడు, హనుమంతు, రాధ దేవి, తిరుమలదేవి, రొద్దం, పెనుకొండ, సికె పల్లి, రామగిరి మండలాల బాలల సంఘం పిల్లలు, వాలెంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన వాల్మీకి సంఘం నాయకులు

కదిరి టౌన్ : వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు పుట్టపర్తి వచ్చిన కేంద్ర సహాయ మంత్రి చౌహాన్‌ను వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బంగారు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో నాయకులు కలిశారు. ఈ మేరకు వాల్మీకి బోయలను ఎస్టీల్లో చేర్చాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు బంగారు కృష్ణమూర్తి మాట్లాడుతూ సత్యసాయి జిల్లా పర్యటన నిమిత్తం వచ్చిన కేంద్రమంత్రిని కలసి బోయల సమస్యలను వివరించామన్నారు. వాల్మీకి బోయలను ఎస్టీలుగా పునరుద్దరణ కార్యక్రమం చేపట్టాలని నరేంద్ర మోడీ కర్నూలు సాక్షిగా తమకు హామీ కూడా ఇచ్చారని గుర్తు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ అధ్యక్షుడు ధనుంజయ, జిల్లా నాయకులు సుదర్శన్ , కదిరి వాల్మీకి హరి, నల్లమాడ రవీంద్ర, వాల్మీకి సాయి తదితరులు పాల్గొన్నారు



కేంద్రమంత్రిని కలిసిన వాల్మీకిసంఘం నాయకులు

వికలాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి : ఆర్డీవో

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

వికలాంగత్వం శరీరానికే గాని మనసుకు కాదని వికలాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు పోవాలని పుట్టపర్తి ఆర్డీవో భాగ్య రేఖ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సాయి ఆరామంలో సత్యసాయి జిల్లా వికలాంగుల సదస్సు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా 2016 దివ్యాంగుల చట్టంపై వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్డీవో మాట్లాడుతూ వికలత్వం ఉన్న చాలామంది ఆత్మస్థైర్యంతో ఎన్నో విజయాలు సాధించారన్నారు. వికలాంగులకు ప్రభుత్వం ఎన్నో సౌకర్యాలు కల్పిస్తోందని 2016 చట్టంపై అవగాహన పెంచుకొని వాటిని వినియోగించుకుని సౌకర్యాలు పొందాలని సూచించారు. దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు షఫీ వికలాంగులు ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగిరెడ్డి తదితరులు మాట్లాడుతూ వికలాంగులు తమ హక్కులపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా పలువురికి వీల్‌ఛైర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మరుగుజ్జుల రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దిలేటి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నూతన వస్త్రాలు పంపిణీ

సదస్సులో పాల్గొన్న దాదాపు 130 మంది వికలాంగులకు టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. వికలాంగులకమ్యూనిటీ భవన నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు కదిరి విద్యార్థులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ప్రజాశక్తి కదిరి టౌన్

ఎస్‌జిఎఫ్‌ఐ రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు కదిరి విద్యార్థులు ఎంపికైనట్లు మాస్టర్ షేక్షావలి తెలిపారు. ఈనెల 21 న హిందూపూర్ లో జరిగిన ఎస్‌జిఎఫ్‌ఐ జిల్లాస్థాయి సెలక్షన్స్ కరాటే మాస్టర్ షేక్షావలి ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో ఏడుగురు బంగారు పతకాలు సాధించారు.నలుగురు వెండి పతకాలు సాధించారు. వీరిలో వాల్మీకి స్కూల్ విద్యార్థి సోహిత్ 54 కేజీ అండర్ 17 విభాగంలో గోల్డ్ మెడల్స్ సాధించాడు. బ్లూమూన్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థిని 50 కేజీల అండర్ 17 విభాగంలో సిరి గోల్డ్ మెడల్ సాధించింది. సమీరా 50 కేజీ ల అండర్ 14 విభాగంలో గోల్డ్ మెడల్ సాధించింది. బ్లూమూన్ ఇంటర్నేషనల్ కాలేజ్ కిరణ్, 54 కేజీల అండర్19 విభాగంలో గోల్డ్ మెడల్ సాధించాడు.జైన్ స్కూల్ విద్యార్థిని నికిత బాయ్ 55 కేజీల అండర్ 17 విభాగంలో గోల్డ్ మెడల్ సాధించింది. స్పేస్ కాలేజ్ విద్యార్థిని యశస్విని 50 కేజీ ల అండర్ 17 విభాగంలో గోల్డ్ మెడల్స్ సాధించింది.ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థిని నాగ వర్షిత 45 కేజీ ల అండర్ 14 భాగంలో బంగారు పతకం సాధించింది. అదేవిధంగా ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థిని సోనీ బాయ్, 40 కేజీ ల అండర్ 17 భాగంలో సిల్వర్ మెడల్ సాధించింది. ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థిని నాగ వర్షిత 45 కేజీ ల అండర్ 14 భాగంలో సిల్వర్ మెడల్ సాధించింది. సెయింట్ థామస్ స్కూల్ విద్యార్థి రిహాన్54 కేజీ అండర్ 17 విభాగంలో సిల్వర్ మెడల్ సాధించాడు.ప్రభుత్వ బాలుర పాఠశాల విద్యార్థి కేశవర్ధన్ నాయక్ 45 కేజీ ల అండర్ 14విభాగంలో సిల్వర్ మెడల్ సాధించాడు.ఈ విద్యార్థులు 29 తేదీన ఒంగోలులో జరిగే ఎస్‌జిఎఫ్‌ఐ రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు అర్హత సాధించినట్లు కరాటే మాస్టర్ షేక్షావలి తెలిపారు.